సాక్షి
నారాయణపేట
శనివారం । 11 । జనవరి । 2025



నమో.. వేంకటేశాయ

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మన్యంకొండ ఆలయం జన సంద్రమైంది.

వివరాలు 10లో ▸



ముగ్గుల పోటీలు

ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

వివరాలు 11లో ▸


గరిష్టం/కనిష్టం
30.7/13.0

వాతావరణం

చలి తీవ్రత కాస్త పెరుగుతుంది. ఉదయం వేళ మంచు కురుస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

తీరనున్న పరేషన్

కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు ప్రభుత్వం సన్నద్ధం



- ఈ నెల 26 నుంచి జారీకి కసరత్తు
- ఏళ్లుగా కార్డుల కోసం నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

సాక్షి, నాగర్‌కర్నూల్/మరికల్: కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కసరత్తు మొదలైంది. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో కొత్తకార్డుల జారీపై అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ సైతం ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. దీంతో ఏళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న దరఖాస్తుదారుల్లో ఆశలు నెలకొన్నాయి.

❑ గత ప్రభుత్వంలో రేషన్ కార్డులో పేరు ఉండి మృతి చెందిన, పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన ఆడపిల్లల పేర్లను 360 డిగ్రీస్ అనే కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డీలర్ల సర్వే ప్రతిపాదనతో తొలగించారు. ఆడపిల్లలు పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్తే.. అక్కడ వారి పేర్లు రేషన్ కార్డులో నమోదు కాలేదు. దాదాపు ఎనిమిదేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో అర్హులైన పేదలు, కొత్తగా పెళ్లైన జంటలు, దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రామాణికంగా మారడంతో చాలామంది అర్హులు సైతం పథకాలకు దూరం అవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ ప్రక్రియలోనూ రేషన్‌కార్డు లేని కారణంగా చాలామంది రైతులకు మాఫీ కాలేదు. ప్రభుత్వం మూడు రకాల కార్డులు.. ఆహారభద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు జారీ చేసింది. వీటికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో మొత్తం 9,26,636 రేషన్ కార్డు లు ఉండగా.. కొత్త కార్డుల కోసం 93,189 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 30,345, నాగర్‌కర్నూల్ జిల్లాలోనే 28,763 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

❑ గతేడాది గతేడాది అక్టోబర్ 2న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కింద మళ్లీ రేషన్‌కార్డు దరఖాస్తులకు అవకాశం ఇచ్చింది. అయినా ఇప్పటివరకు దరఖాస్తులకు మోక్షం కలగలేదు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీకి మొగ్గుచూపడంతో దరఖాస్తుదారులకు ఊరట లభించనుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించనుంది.

పాత నిబంధనలే అమలు..

కొత్త రేషన్‌కార్డుల జారీని పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక విషయంలో పాత నిబంధనలనే వర్తింపజేయాలని అధికారులకు సూచించింది. అయితే అర్హులైన వారికే ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది. కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు. ఈ నెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు.

జిల్లాల వారీగా రేషన్‌కార్డు దరఖాస్తుల వివరాలు

జిల్లా	రేషన్‌కార్డులు	కొత్తగా వచ్చిన దరఖాస్తులు
మహబూబ్‌నగర్	2,36,500	30,345
నాగర్‌కర్నూల్	2,33,928	28,763
వనపర్తి	1,57,094	11,501
జోగులాంబగద్వాల	1,60,789	13,189
నారాయణపేట	1,38,325	9,391

..పదేళ్లయినా కార్డు లేదు



నాకు వివాహం జరిగి పదేళ్లు అయింది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. కానీ మా కుటుంబానికి రేషన్ కార్డు లేదు. అందుకే ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు మాకు వర్తించడం లేదు. ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం.

– ఎర్రగొల్ల చెన్నమ్మ, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

ఇప్పటికైనా ఇవ్వాలి..



కొత్త రేషన్‌కార్డు కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రేషన్‌కార్డు నంబర్ కావాలంటున్నారు. కానీ తమకు కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ కూడా వర్తించడం లేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను. సంక్రాంతికి కొత్త కార్డులు ఇస్తామని సీఎం చేసిన ప్రకటనపై ఆశలు రేకెత్తాయి. ఇప్పటికైనా కొత్త కార్డులు ఇవ్వాలి.

– రమేష్, మరికల్



మరికల్‌లోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం..



ప్రజాపాలనలో దరఖాస్తు చేసినప్పటి నుంచి కొత్త కార్డుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. రేషన్ కార్డులో కొత్తగా పేర్లు నమోదు చేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ప్రతి ఇంట్లోని కుటుంబ సభ్యులతో కూడిన కార్డు జారీ చేయాలి.

– రాములు, మాజీ సర్పంచ్, బూద్యాగానితండా

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన వెంటనే ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనతో పాటు కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం.

– సుదర్శన్, పౌరసరఫరాల శాఖ అధికారి, నారాయణపేట

న్యూస్‌రీల్

108 సేవలు వినియోగించుకోవాలి



నారాయణపేట: 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ కోరారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని 108 వాహనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటిలోని వివిధ రకాల పరికరాలు, పనితీరు, మందులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాల్‌సెంటర్ నుంచి ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బంది అప్రమత్తంగా ఉండి వెంటనే ప్రమాదస్థలికి చేరుకొని ఆస్పత్రికి తరలించాలన్నారు. ఆపత్కాలంలో 108 నంబర్‌కు కాల్ చేసి ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని పొందాలని.. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎగ్జిక్యూటివ్ రాఘవేందర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలట్లు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలి : డీఈఓ



నారాయణపేట రూరల్: విద్యాశాఖలోకి అడుగిడుతున్న కొత్త ఉపాధ్యాయులు వృత్తికే వన్నె తెచ్చేలా విధులు నిర్వర్తించాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో పనిచేయాలని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సమయపాలన పాటించడం, క్రమశిక్షణతో మెలగడం, టీఎల్‌ఎం ఉపయోగిస్తూ విద్యాబోధన చేయడం, చదువుతో పాటు అన్నిరకాల కళల్లో రాణించేలా తర్ఫీదునివ్వాలన్నారు. అంతకుముందు ఏఎంఓ విద్యాసాగర్ మాట్లాడుతూ.. వృత్తి జీవితంలో శిక్షణలు మన సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తాయని వివరించారు.రెండ్రోజుల శిక్షణలో 148 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, 90 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రమోషన్ ద్వారా స్కూల్ అసిస్టెంట్లుగా నియమితులైన 378 మందికి కూడా త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. గతంలో విద్యాశాఖలో సీఆర్పీలుగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికైన హుస్సేనప్ప, రమేశ్‌ను శాలువాతో సన్మానించారు.

కొనసాగుతున్న రోడ్డు భద్రత మాసోత్సవాలు



నారాయణపేట: జిల్లాకేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆర్టీఓ మేఘాగాంధీ, సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, రహదారి నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు కూడా హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉపయోగించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు డబ్బులు ఆశ జూపినా, తినుబండారాలు ఇచ్చినా తీసుకోరాదన్నారు. లిఫ్ట్ ఇస్తామన్నా తీసుకోరాదని.. వారు చెప్పే మాయమాటలు నమ్మకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆపద సమయంలో ఉంటే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో రహదారి నిబంధనలు పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

తెల్ల కంది క్వింటా రూ.8,629

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం తెల్ల కంది క్వింటా గరిష్టంగా రూ.8,629, కనిష్టంగా రూ.7,289 ధర పలికాయి. అలాగే ఎర్ర కంది రూ.8,353–రూ.7,040, వరి సోనా రకం గరిష్టంగా రూ.2,506, కనిష్టంగా రూ.2,140 ధరలు లభించాయి.

‘ముక్కోటి’ సంబురాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



స్వామివారికి తులసి అర్చన

నారాయణపేట రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలోని పళ్లలో ఉన్న పురాతన అనంతశయన స్వామి ఆలయంలో ఉదయం 5 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీపాద కులకర్ణి స్వామివారి మూల విగ్రహానికి అభిషేకం నిర్వహించి పల్లకీ సేవ ద్వారా ఉత్తర ద్వారం చేరుకొని అక్కడ రఘుప్రేమాచార్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం భక్తులు ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణం నుంచేగాక కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో నర్సింహాచార్, శ్రీధర్రావు, శేషు, ప్రసాద్, ప్రకాశ్, వెంకటేశ్, వెంకుశాస్త్రి, వేణు, కంసాన్‌పల్లి రఘునాథ్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు. సరాఫ్‌బజార్ బాలాజీ మందిర్‌లో స్వామివారికి మహా అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి మార్వాడి సంఘం నాయకులు తులసి అర్చన చేశారు. మండలంలోని తిరుమలాపూర్‌లో స్వామివారి చిత్రపటంతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. జయతీర్థ, ముకుందయ్య, శ్రీధర్‌రావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

‘డయల్ 100’ సేవలు కీలకం

నారాయణపేట: జిల్లాలో శాంతిభద్రతలు కాపాడటం, ఆపదలో ఉన్న ప్రజల నుంచి వచ్చే డయల్ 100 ఫిర్యాదులకు వెంటనే స్పందించి త్వరగా ఘటన స్థలానికి చేరుకొని బాధితుల సమస్యలు పరిష్కరించే దిశగా డయల్ 100 పోలీసులు కృషి చేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. డయల్ 100 సేవల నిర్వహణపై శుక్రవారం బ్లూకోర్ట్స్, పెట్రోకార్ సిబ్బంది, కంట్రోల్ రూమ్ పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నిర్వర్తించాల్సిన విధులు, పాటించాల్సిన నియమాలపై సూచనలు చేశారు. రోజు ఎలాంటి సమస్యలపై డయల్ 100 ఫిర్యాదులు వస్తున్నాయి.. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకొన్నారు. హైదరాబాద్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా డయల్ 100 డ్యూటీలో ఉన్న పీసీకి, ఎస్‌హెచ్‌ఓకి, కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందుతుందని.. వెంటనే గుర్తించి ఘటన స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఘటన స్థలానికి చేరుకున్న తర్వాత బాధితులకు న్యాయం చేకూరేలా విచారణ చేపట్టాలని, సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి స్టేషన్ సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. డయల్ 100 ట్యాబ్‌లను జాగ్రత్తగా వినియోగించి నిరంతరం సిగ్నల్స్ అందుబాటులో ఉండేలా చూసుకుంటూ, అనవసరమైన



వీసీలో పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

ఇతర అప్లికేషన్లను వినియోగించరాదని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీలు నిర్వహిస్తూ ఎలాంటి అసాంఘిక ఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ మొబైల్, టాబ్లెట్, సెట్ ద్వారా కమ్యూనికేషన్ సమాచారాన్ని సంబంధిత సిబ్బందికి చేరవేసి బాధితుల వద్దకు చేరుకునేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే వాహనాలకు సంబంధించి ఏమైనా మరమ్మతులుంటే లేఖ పంపించి త్వరగా చేయించుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి ప్రతినెల కండిషన్, రిపేర్లు మొదలైనవి తనిఖీ చేయాలని ఎంటీఓకు సూచించారు. ఐటీ కోర్ టీమ్, జిల్లాలోని బ్లూకోర్ట్స్, పెట్రోకార్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఆశాలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి’

నారాయణపేట: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించేలా అసెంబ్లీ సమావేశంలో నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నివాసం సీవీఆర్ భవన్‌కు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో వారు మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు అతి తక్కువ వేతనం చెల్లిస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎం శిక్షణ పూర్తిచేసిన ఆశాలకు ఏఎన్‌ఎం ప్రమోషన్లు ఇవ్వాలని, ఏఎన్‌ఎం పోటీ పరీక్షల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.



ధర్నా వద్ద మాట్లాడుతున్న నాయకులు

లేనిపక్షంలో దశల వారీగా పోరాడతామని హెచ్చరించారు. జనవరి 21న అన్ని కలెక్టరేట్లకు 10 కిలోమీటర్ల దూరం నుంచి పాదయాత్ర చేస్తామని తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే ప్రతినిధి, స్థానిక మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డికి డిమాండ్ల వినతిపత్రం అందజేశారు. నాయకులు గోపాల్, అంజిలయ్యగౌడ్, జోషి, ఆశ కార్యకర్తలు రాధ, ఉమాదేవి, రాధిక, భాగ్యమ్మ, రేణుక, జ్యోతి, మౌనిక, శశికళ, అనురాధ, నాగమణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పొలం బాటలకు మహర్దశ

ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు

- ఉపాధిహామీ పథకంలో ఆరు రకాల పనులకు ప్రాధాన్యం
- మహిళాశక్తి, జలనిధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయం
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పనుల పూర్తికి చర్యలు



నర్వ మండలంలోని ఓ గ్రామంలో వర్షాకాలంలో పొలానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు (ఫైల్)

నర్వ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతులకు సంబంధించిన పనులు చేపట్టేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ నడుం బిగించింది. తాజాగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పనుల జాతర పేరిట ప్రణాళిక సిద్ధం చేయగా, వచ్చే ఏడాది మార్చి చివరిలోగా పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వీటిలో రైతులు తమ పొలాలకు కాలినడక బాటలు బాగు చేసేందుకు శ్రీకారం చుడుతున్నారు. ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించారు.

రైతుల ఇబ్బందులు తీర్చేలా..

రైతులు తమ ఆవాసాల నుంచి పొలాలకు సరైన రహదారులు లేక ఒడ్డు, గట్ల పైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పొలాలకు యూరియా తదితర సంచులు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వారి అవస్థలు చెప్పనలవి కావు. దీంతో ప్రభుత్వం పొలాల బాట బాగుకు ప్రత్యేక నిధులు కేటాయించి పనుల ఎంపిక చేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిహామీ ద్వారా మరిన్ని పనులు..

కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సగటు మనిషికి ఏదో ఒక పని కల్పించి తద్వారా ఉపాధినివ్వాలని సంకల్పించిన కార్యక్రమం. వేసవిలో వ్యవసాయ పనులు లేక రైతులు, కూలీలు ఖాళీగా ఉన్నందున వారికి ఉపాధి చూపేందుకు ఈ ఏడాది అనేక పనులు రూపొందించింది. 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి గుర్తించిన పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పనులను వేగవంతం చేసింది. గతేడాది అక్టోబర్ 2 నుంచి గ్రామసభల్లో ఆమోదించిన పనులు వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయడానికి మండలం యూనిట్‌గా మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం సూచించిన 6 రకాల పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో సింహభాగం మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించారు. ఈ పనుల్లో ఇంటింటికి ఇంకుడు గుంత, రైతుల పొలాల్లో ఫాంపాండ్స్, కంపోస్టు ఎరువు తయారీ యూనిట్.

మహిళాశక్తికి భరోసా..

మహిళా సంఘాల సభ్యులందరికి ఉపాధి కల్పించేలా ఉపాధిహామీ పథకంలో భాగస్వాములను చేయనున్నారు. వారిని స్వయం ఉపాధివైపు మళ్లించేలా రుణాలిచ్చి ఆవులు, మేకల పెంపకం చేపట్టేలా చేస్తారు. పశువుల షెడ్లు, వర్మీ కంపోస్టు, అజొల్లా మొక్కల పెంపకం, బీడు భూములను అభివృద్ధి చేస్తారు.

పొలం బాటలు..

గ్రామాల్లో పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చడానికి ఈసారి మట్టిదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తారు. జిల్లాలో మట్టిదారుల నిర్మా పనులు చేపట్టనున్నారు.

ఫలాల వనాలు..

ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించడం, రాయితీపై స్ప్రింక్లర్లు, పరికరాలిస్తారు. ఈత, తాటి వనాలు పెంచనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన నర్సరీల్లో ఈ పనులు చేపట్టనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఉపాధిహామి జాబ్‌కార్డులు 2,03,102 ఉండగా.. వీరిలో 47,333 మందికి పని కల్పించారు. జిల్లాలో పని చేస్తున్న కూలీలు 73,331 మంది కాగా.. ఇప్పటి వరకు వంద రోజులు పనిచేసిన కూలీలు 315 మంది ఉన్నారు. ఇందుకోసం కూలీలకు చెల్లించిన నగదు రూ.3,819.62 లక్షలు కాగా.. రోజుకు సగటున రూ.202.92. జిల్లాలో చెల్లించిన మొత్తం నగదు రూ.4,932.57 లక్షలు. ప్రతి ఏడాది నిర్దేశించిన మేరకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. నాలుగు నెలల లక్ష్యంగా నిర్దేశించిన 6 పనులకు ప్రాధాన్యం.

జల సంరక్షణ..

జల సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఇంటింటా ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్, ఇంటి పైకప్పు భాగంలో కురిసిన నీటిని భూగర్భంలోకి ఇంకించడం, చేతిపంపుల వద్ద ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వడం, చెక్‌డ్యాం నిర్మించేలా చర్యలు తీసుకోనున్నారు.

గ్రామీణ పారిశుద్ధ్యం..

గ్రామాల్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కో మండలంలో కనీసం 10 చొప్పున ఇంకుడు గుంతలు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు.

మౌలిక వసతులు..

గ్రామాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా మరుగుదొడ్లు, సిమెంట్ రహదారుల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలను నిర్మించనున్నారు. మండలానికి ఐదు చొప్పున చేపట్టనున్నారు.

రైతుల పనులకు ప్రాధాన్యం..

రైతులు తమ వ్యవసాయ పొలాలకు చేరుకునేందుకు చాలాచోట్ల సరైన రహదారులు లేవు. కాలినడక బాటలను ఫార్మేషన్ రోడ్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట పనులు చేపట్టేందుకు ఎంపిక చేస్తున్నాం. గ్రామసభలో గుర్తించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. వచ్చే ఏడాది మార్చి 31 వరకు పనుల పూర్తికి ప్రణాళికలు రూపొందించాం. అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మొగులప్ప, డీఆర్డీఓ



ఇరుకుగా ఉన్న లక్కర్‌దొడ్డి, పెద్దకడ్మూర్ రైతుల పొలం బాట

క్లుప్తంగా

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: కొంతకాలంగా తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని సద్దలగుండుకు చెందిన రహీం(82) ఆర్టీసీ పని చేసిన రిటైర్డ్ అయ్యాడు. ఆయన కొన్ని రోజుల నుంచి ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక ఇబ్బంది పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులు చికిత్స జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పశువులను అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన ఐదు పశువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అప్పాజిపల్లి రైతులు వెంకటయ్య, యాదయ్య, తిరుపతయ్య తమ పశువులను తమ వ్యవసాయ పొలంలో ప్రతిరోజు మేపి రాత్రి వేళ అక్కడే పశువులను కట్టేసి ఇంటికి తిరిగి వచ్చేవారు. యథావిధిగా గురువారం రాత్రి పశువులను కట్టేసి ఇంటికి తిరిగి వచ్చారు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా పొలంలో పశువులు కనిపించలేదు. రూ.3లక్షల విలువైన ఐదు పశువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: మండలంలోని సవాయిగూడెం అటవీ ప్రాంతంలో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. వనపర్తి మండలంలోని సవాయిగూడెం గ్రామ శివారులోని ఫారెస్ట్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) ఊడగ చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. మృతదేహంపై తెల్లని చొక్కా, కాలర్‌పై జీటీ ఫ్యాషన్ టైలర్ మార్కు ఉందన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లు అయితే రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ 8712670611, ఎస్ఐ 8712670613కి సమాచారమివ్వాలని కోరారు.

బొగ్గు ట్రాక్టర్ బోల్తా

జడ్చర్ల: జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద 167 నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం బొగ్గును తరలిస్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. సిగ్నల్‌గడ్డ వద్ద కొత్తబస్టాండ్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ రైల్వే బ్రిడ్జి దాటిన తరువాత రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు. రోడ్డుపై బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సత్వరమే జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను అక్కడి నుండి తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

సైబర్ క్రైం కేసు నమోదు

గోపాల్‌పేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం పై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నర్సింగాయపల్లికి చెందిన పసుపుల కేశవులుకు 24 నవంబర్, 2024 న ఓ వ్యక్తి ఫోన్ చేసి మీకు ధనీ యాప్‌లో రూ.3.50లక్షలు మంజూరు అయ్యాయి. రూ.35వేలు చెల్లిస్తే ఆ డబ్బులు మీ అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పడంతో.. నమ్మిన కేశవులు నేరగాళ్లు చెప్పిన నంబర్‌కు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపాడు. తన డబ్బులు చెల్లించాలని గట్టిగా అడగడంతో అవతలి వారి ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో మోసపోయానని గుర్తించి యువకుడు 1930 నంబరుకు ఫోన్ కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. డబ్బులు ఫ్రీజ్ అయ్యాయని బాధితుడి సెల్‌కు గురువారం మెసేజ్ వచ్చింది. శుక్రవారం గోపాల్‌పేట పీఎస్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

చలిమంటల్లో పడి యువకుడికి గాయాలు

హన్వాడ: చలిమంట కాచుకుంటూ ఓయువకుడు మంటల్లో పడి తీవ్ర గాయలపాలైన ఘటన శుక్రవారం మండలంలోని గొండ్యాల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సంతోష్(28) శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో చలిమంట కాచుకునేందుకు వెళ్లాడు. తూలుతూ మంటల్లో పడటంతో దుస్తులు, శరీరానికి మంటలు అంటుకొని తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే యువకుడిని మంటల్లో నుంచి బయటికి తీశారు. 108 వాహనాకి కాల్ చేయగా ఘటనాస్థలికి చేరుకొని బాధితుడిని హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంతోష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

బీజేపీ కార్యకర్త సంతోష్ మంటల్లో పడి తీవ్ర గాయాలపాలైన విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు రఘురాములుగౌడ్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈవిషయాన్ని ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం అందించాలని జనరల్ ఆస్పత్రి వైద్యులకు ఎంపీ సూచించినట్లు ఆయన తెలిపారు.

ఆరంభం.. అదిరింది

అట్టహాసంగా నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

- మార్చ్‌ఫాస్ట్‌తో అలరించిన రాష్ట్రాల జట్లు
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ కొత్వాల్, చిత్రంలో పలువురు చైర్మన్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం అండర్-17 నేషనల్ స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభించారు. టోర్నీలో ఆయా రాష్ట్రాలకు సంబంధించి 35 బాలికలు, 36 బాలుర జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నీ ప్రారంభోత్సవం సందర్భంగా తొలుత ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభమైన మార్చ్ ఫాస్ట్ చివరగా అతిథ్య తెలంగాణ రాష్ట్ర జట్టుతో ముగిసింది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నృత్యాలకు రాష్ట్రాల క్రీడాకారులు చప్పట్లతో హోరెత్తించారు. అనంతరం నేషనల్ టోర్నీ ప్రారంభానికి సూచికగా పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ప్రారంభ వేడుకల్లో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యత

టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

➪ ఎన్‌పీ వెంకటేశ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించాలన్నారు. డీవైఎస్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో ఆడాలని కోరారు. అంతకుముందు కొత్వాల్, ఆనంద్‌గౌడ్ క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. మార్చ్‌పాస్ట్‌లో క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ ఫీల్డ్ ఆఫీసర్ దేవేందర్‌నాథ్ గోస్వామి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి కురుమూర్తిగౌడ్, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్బూద్ బిన్ అహ్మద్ జాకీర్, పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జియావుద్దీన్, నిర్వాహక కమిటీ సభ్యులు రజనీకాంత్‌రెడ్డి, బాలరాజు, కౌన్సిలర్ రాము, పీడీలు వేణుగోపాల్, నాగరాజు, రాఘవేందర్, ఫారుఖ్ ముకర్రం, ఉమాదేవి, మేరిపుష్ప, అరుణజ్యోతి, స్వప్న, సోహైల్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

టోర్నీలో తమకు కేటాయించిన చోట గదుల్లో బెడ్లు లేవని, సరైన సౌకర్యాలు లేవంటూ కొన్ని రాష్ట్రాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు ఆందోళన వ్యక్తం చేశారు. టోర్నీ మొదటి రోజు అని కొంత సర్దుకోవాలని, సాయంత్రం వరకు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు నచ్చజెప్పడంతో వారు శాంతించారు. అదేవిధంగా స్టేడియంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో సరిపడా మందులు లేకపోవడంతో క్రీడాకారులు కొంత ఇబ్బందులు పడ్డారు.

శుభారంభం చేసిన ఏపీ బాలికల జట్టు

మొదటి రోజు బాలికల విభాగం మ్యాచులో ఆంధ్రప్రదేశ్ జట్టు శుభారంభం చేసింది. 17-1 గోల్స్ తేడాతో ఐపీఎస్‌సీ జట్టుపై విజయం సాధించింది. ఇతర బాలికల విభాగం మ్యాచుల్లో ఉత్తరప్రదేశ్ 29-3 గోల్స్ తేడాతో జార్ఖండ్‌పై, పంజాబ్ 23-1 తేడాతో ఎన్‌వీఎస్‌పై, ఒడిశా12-6 తేడాతో అసోంపై, గుజరాత్ 14-5 తేడాతో ఉత్తరాఖండ్‌పై, మధ్యప్రదేశ్ 22-6 తేడాతో విద్యాభారతిపై, సీఐఎస్‌సీఈ 10-3 తేడాతో పుదుచ్చేరిపై, తమిళనాడు 13-8 తేడాతో కేరళపై గెలుపొందాయి. బాలుర విభాగం మ్యాచుల్లో ఢిల్లీ 26-7 గోల్స్ తేడాతో పుదుచ్చేరిపై, ఎన్‌వీఎస్ 31-23 తేడాతో విద్యాభారతిపై, బిహార్ 24-9 తేడాతో ఉత్తరాఖండ్‌పై విజయం సాధించగా డీఏవీ-మధ్యప్రదేశ్ జట్ల మధ్య 16-16 పాయింట్లతో మ్యాచ్ టైగా ముగిసింది.



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న తెలంగాణ క్రీడాకారులు



తలపడుతున్న హరియానా- కేవీఎస్ క్రీడాకారులు

జడ్చర్ల వద్ద హైవేపై రోడ్డు ప్రమాదం

- ఇద్దరి దుర్మరణం..15 మందికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

జడ్చర్ల: జాతీయ రహదారిపై విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి 11 గంటకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. రాత్రి 9 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి 50 మంది ప్రయాణికులతో జైభారత్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అరుణాచలం క్షేత్రానికి బయల్దేరింది. జడ్చర్ల కొత్త బస్టాండ్‌కు కిలోమీటర్ దూరంలో త్రీస్టార్ హోటల్ సమీపంలో ఓ కారు టైరు పంచర్ కావడంతో జాతీయ రహదారిపై ఆగిపోయింది. కారును వెనుకే వేగంగా వచ్చిన ఓ లారీ ఆ కారును ఒక వైపు ఢీకొట్టిన సమయంలో లారీడ్రైవర్ బ్రేకులు వేశాడు. దీంతో లారీ వెనుక అతివేగంగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆ లారీని బలంగా ఢీకొట్టడంతో బస్సులోని ప్రయాణికుడు నూర్ (45), క్లీనర్ (40) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా.. వీరిని 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో శ్రీకాంత్, షణ్ముకం, సింధు, రాధాక్రిష్ణ పరిస్థితి కాస్త విషమంగా ఉంది. ప్రమాద ఘటనలో బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం పోలీసులు బాదేపల్లి ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ఘటనస్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సంక్రాంతి రద్దీ కావడంతో ప్రమాదం జరిగిన వద్ద దాదాపు కిలోమీటర్ మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది.



ఘటనాస్థలంలో ప్రమాద పరిస్థితి

నమో.. వేంకటేశాయ



మన్యంకొండ కోనేరు వద్ద భక్తులు కోలాహలం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శుక్రవారం జనసంద్రమైంది. ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి వేడుకలను మన్యంకొండలో ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అలంకారోత్సవం చేశారు. ఉదయం 7 గంటల నుంచే దేవస్థానంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాటు చేశారు. కోనేరు నుంచి గర్భగుడి వరకు భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. అనంతరం శివాలయంలో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొందరు తలనీలాలు సమర్పించి స్వామివారికి మొక్కులు సమర్పించారు. దేవస్థానంతో పాటు స్టేజీ సమీపంలోని శ్రీ అలివేలు మంగతాయారు దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా శేషవాహన సేవ

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారి శేషవాహనసేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న సభా మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. శేషవాహనంలో స్వామివారు స్వర్ణాభరణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని తిరిగి శేషవాహనంలో హనుమద్దాసుల మండపం వద్దకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, అర్చకులు పాల్గొన్నారు.



కిక్కిరిసి పోయిన క్యూలైన్



మన్యంకొండలో శేషవాహన సేవ నిర్వహిస్తున్న పురోహితులు

కురుమూర్తి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం



కురుమూర్తి స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న మహబూబ్‌నగర్ అదనపు ఎస్పీ రాములు

స్వామి సన్నిధిలో అదనపు ఎస్పీ ప్రత్యేక పూజలు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ఉదయం నుంచే ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది ఆలయాన్ని శుద్ధిచేసి ఉత్తర ద్వారంతో పాటు ఆలయ ప్రాంగణమంతా పూలమాలతో అలకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చి ఉత్తరద్వార దర్శనం చేసుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహబుబ్‌నగర్ అదనపు ఎస్పీ రాములు దంపతులు కురుమూర్తి స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి శాలు వాలతో సత్కరించారు. వారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహబుబ్‌నగర్ అదనపు ఎస్పీ రాములు దంపతులు కురుమూర్తి స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలు వాలతో సత్కరించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కిడ్నాప్ నిందితులు రిమాండ్‌కు తరలింపు

శాంతినగర్ : రమేష్‌బాబు కిడ్నాప్ కేసులో నిందితులైన నలుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు శాంతినగర్ సీఐ టాటాబాబు తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శాంతినగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి రమేష్‌బాబునును హైదరాబాద్‌లో నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. అతడి అకౌంట్‌లో వున్న రూ.50వేలు తీసుకొని, రూ.10 లక్షలు అవసరం ఉందని, వెంటనే పంపాలని భార్యకు ఫోన్ చేయించారన్నారు. అనుమానం వచ్చిన రమేష్‌బాబు భార్య సుభాషిణి అదే రోజు రాత్రి బంధువులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఫోన్‌కాల్ వచ్చిన ప్రదేశాన్ని టెక్నికల్ టీం సాయంతో ట్రాప్‌చేసి అర్ధరాత్రి కానిస్టేబుళ్లను హైదరాబాద్‌కు పంపి రమేష్‌బాబును రక్షించారన్నారు. కిడ్నాప్‌కు పాల్పడిన శాంతినగర్‌కు చెందిన భూపాల్ శెట్టి, హైదరాబాద్‌లో నివాసం వుంటున్న సత్యనారాయణ, కలుకుంట్లకు చెందిన మహమ్మద్ అలీ అలియాస్ రఫీ, శాంతినగర్‌కు చెందిన సతీష్ నలుగురిని గురువారం సాయంత్రం అలంపూర్‌చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులను అలంపూర్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. వారి నుంచి 7 సెల్‌ఫోన్లు, రూ.50 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో శాంతినగర్ ఎస్ఐ సంతోష్, పోలీసు సిబ్బంది వున్నారు.



నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న సీఐ టాటాబాబు, ఎస్ఐ సంతోష్

భవిత కేంద్రాలు వినియోగించుకోవాలి

వనపర్తి విద్యావిభాగం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి సేవలు మానసిక, మేధో సంబంధ వైకల్యం కల వారు సద్వినియోగం చేసుకోవాలని ఈ సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. పట్టణానికి చెందిన యాదమ్మ తన కుమార్తె భవానీ భవిత మానసిక వైకల్యంతో బాధపడుతుందని, మాటలు కూడా సరిగ్గా రావడం లేదని తనకు స్పీచ్ థెరపీ చేయించడంతో పాటు స్కూలులో చేర్పించి చదువు చెప్పించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని కోరారు. స్పందించిన కార్యదర్శి రజిని బాధిత చిన్నారిని జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్ చేర్పించడంతో పాటు స్కూల్‌లో అడ్మిషన్ ఇప్పించారు. భవిత సెంటర్‌లో మానసిక వైకల్యంలో బాధపడుతున్న ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలకు స్పీచ్ థెరపి, అక్షరాలు నేర్పిస్తారని పేర్కొన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే వారిని భవిత కేంద్రంలో చేర్పించాలని కోరారు. తమ కుమార్తె సమస్యపై స్పందించిన న్యాయ సేవాధికార సభ్యులకు యాదమ్మ కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారి భవానీని భవిత సెంటర్‌లో చేర్పుతున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు

వెట్టి నుంచి కూలీలకు విముక్తి



వెట్టి నుంచి విముక్తి కల్పించి కూలీలను స్వగ్రామాలకు పంపిస్తున్న గిర్దావర్ సుదర్శన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఓ గుంపు మేస్త్రీ నిర్బంధంలో ఉన్న కూలీలకు మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరాంనాయక్ విముక్తి కల్పించారు. బండమీదిపల్లి శివారులో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో పనుల్లో కూలీలు పని చేస్తున్నారు. గుంపు మేస్త్రీ కిషన్‌నాయక్ మూడు నెలలుగా తమను వేధిస్తున్న తీరును గురించి హెల్ప్‌లైన్ ద్వారా గురువారం రాత్రి నేషనల్ ఆదివాసి సాలిడారిటీ కౌన్సిల్ సంస్థ దృష్టికి రావడంతో ఆ సంఘం సంస్థ లీగల్ ఆఫీసర్ వలిగొండ విజయరాజు గురువారం మహబూబ్‌నగర్ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి అర్బర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో కూలీలు పనిచేసే ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టి అక్కడి నుంచి వారిని జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహానికి తరలించి రాత్రి సమయంలో భోజనం, వసతి కల్పించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామానికి చెందిన రెండు జంటలు, అడ్డాకులకు చెందిన ఇద్దరు కూలీలు అని విచారణలో తేలింది. తమ గోడును కూలీలు తహసీల్దార్‌కు విన్నవించుకోగా స్పందించిన ఆయన అందుకు సంబంధించి పూర్తి విచారణ జరిపి వారిని ఆ గుంపు మేస్త్రీ బారి నుంచి రక్షించినట్లు తెలిపారు. తహసీల్దార్ పూర్తి వివరాలు కూలీల నుండి సేకరించి వారిని వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి శుక్రవారం మధ్యాహ్నం వారివారి స్వగ్రామాలకు పంపించివేశారు. ఈ మేరకు గుంపు మేస్త్రీ కిషన్‌నాయక్, నిర్మాణరంగ కంపెనీపై పోలీసు కేసు కూడా నమోదుచేసినట్లు తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ వెంట గిర్దావర్లు సుదర్శన్‌రెడ్డి, నర్సింగ్ ఉన్నారు.

పోలేపల్లిలో పూరిల్లు దగ్ధం

రూ.5 లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన ఇళ్లు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లిలో రేకులతో నిర్మించుకున్న ఓ పూరిల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాలు..తాము ప్రతి రోజు లాగానే ఇంటికి తాళం వేసి బయటకు పనుల నిమిత్తం వెళ్లామని, మధ్యాహ్న సమయంలో ఆకస్మికంగా ఇంట్లో మంటలు వచ్చాయని, వచ్చి చూసే సరికి ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తి దగ్ధమైనట్లు తెలిపారు. ఇంట్లో ఫ్రిజ్, బీరువా, కుట్టు మిషన్, ఆహార పదార్థాలు, బీరువాలో దాచిన దాదాపు రూ.లక్ష నగదు, బంగారం కూడా కాలిపోయాయని అన్నారు. దాదాపు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందన్నారు. విద్యుత్ షార్ట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు, రెవెన్యూ అధికారులు వచ్చి విచారించారు. బాధితులకు మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.5వేలు నగదు సహాయాన్ని అందించినట్లు జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కేటీఆర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

వనపర్తి రూరల్: పట్టణానికి చెందిన యువకుడు అదృశ్యమైన ఘటనపై శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ద్యారపోగు రమేష్ మతిస్థిమితం లేకపోవడంతో వీధుల్లో తిరుగుతుండేవాడు. డిసెంబర్ 31న ఇంటి నుంచి వెళ్లిన రమేష్ తిరిగి రాకపోవడంతో శుక్రవారం అతడి తమ్ముడు ద్యారపోగు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.